క్లుప్తంగా

సాక్షిగణపతికి విశేష పూజలు



సాక్షిగణపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్ర స్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలావీరభద్ర స్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

పంట నమోదులో నిర్లక్ష్యం తగదు



మినుము పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

మిడుతూరు: రైతులు పంట నమోదు చేసుకోవడంలో నిర్లక్ష్య వహించొద్దని నందికొట్కూరు ఏడీఏ విజయశేఖర్ అన్నారు. బుధవారం మిడుతూరులో కంది, మినుము, మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు. ప్రతి రైతు సాగు చేసిన పంటలను ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. పంట నమోదు చేసుకుంటే ఉండే ప్రయోజనాలను వివరించారు. అలాగే పంటలకు ఆశిస్తున్న చీడ, పీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి పీరునాయక్, అగ్రికల్చర్ అసిస్టెంట్ అశోక్, రైతులు పాల్గొన్నారు.

ఈ - క్రాప్ బుకింగ్ చేయించుకోండి



ఈ - క్రాప్ బుకింగ్ చేస్తున్న ఉద్యాన అధికారిణి చందన

ఆత్మకూరురూరల్: అన్నిరకాల ఉద్యాన పంటలకు సంబంధించిన పొలాలను ఈ - క్రాప్ బుకింగ్ తప్పక చేయించు కోవాలని మండల ఉద్యాన అధికారిణి చందన స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో మిరప పంట ఈ - క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు అమలు కావడం కోసం ఈ - క్రాప్ బుకింగ్ తప్పనిసరి అని తెలిపారు. ఉద్యాన పంటలకు పలు ప్రభుత్వ సబ్సిడీలున్నాయని చెప్పారు. తైవాన్ స్ప్రేయర్లు, మినీ ట్రాక్టర్లు, డ్రిప్, స్ప్రింక్లర్లు సబ్సిడీ ధరలకు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో వీఏఏ నరసింహ ,రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'గణపతి గాథలు'



ప్రవచనం వినిపిస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ

శ్రీశైలం టెంపుల్: ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో భాగంగా బుధవారం శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ ×గణపతి గాథలు× ప్రవచనాలు కొనసాగుతున్నాయి. బుధవారం ప్రవచకులు సామవేదం షణ్ముఖ శర్మ మాట్లాడుతూ గణపతిని వేదాలు బ్రహ్మణస్పతిగా అభివర్ణించాయన్నారు. తనను ఆశ్రయించిన భక్తులకు గణపతి బుద్ధి, జ్ఞానాలను ప్రసాదిస్తాడన్నారు. భక్తితో గణపతిని ఆరాధించడం వల్ల మనకు ఎలాంటి విపత్తులు రావన్నారు. గణపతి దుర్వాప్రియుడని, దుర్వాలతో అంటే గరికతో గణపతిని పూజించడం వలన శ్రేయస్సు కలుగుతుందని చెప్పారు. గణపతి యొక్క ప్రతి నామము ఒక మంత్రమేనని, ప్రతి నామము ఎంతో మహిమాన్వితమన్నారు.

కూలేందుకు సిద్ధం

● దుద్యాలలో నేలవాలిన విద్యుత్ స్తంభాలు



దుద్యాల గ్రామంలోని పొలంలో ఒరిగిన విద్యుత్ స్తంభాలు

కొత్తపల్లి: మండల పరిధిలోని దుద్యాల గ్రామంలో విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో దుద్యాల గ్రామం రైతులు ఎక్కువ మొక్కజొన్న పంటలు సాగు చేసుకున్నారు. అయితే గ్రామ సమీపంలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు వద్ద ఉన్న మొక్కజొన్న పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడంతో ఎప్పుడు పడిపోతాయా అని రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పంటలు కోసే సమయం ఆసన్నం అవుతుండడంతో ఆ భయం ఇంకా పెరిగిపోతుంది. విద్యుత్ అధికారులు త్వరగా స్పందించి స్తంభాలను సరిచేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో డ్యూటీలు నిర్వహించే మహిళా డాక్టర్లకు ప్రత్యేకంగా రక్షణ కల్పించాలి. రాత్రివేళల్లో డ్యూటీలు చేసే మహిళా డాక్టర్లకు సెక్యూరిటీని ఏర్పాటు చేయాలి. మరొకరిని సహాయకురాలిగా ఇవ్వాలి. మహిళా డాక్టర్లు, సిబ్బందిపై జరుగుతున్న దాడులు, హత్యాచారాలు, హత్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాలి. రోగులను చూసేందుకు వచ్చే వారిని రాత్రివేళల్లో ఆస్పత్రుల నుంచి పంపించి వేయాలి.

– ధనలక్ష్మి, బైర్లూటి పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్



దాడి చేస్తే రౌడీషీట్ ఓపెన్ చేయాలి



మహిళా వైద్యులు, నర్సులపై, సిబ్బందిపై అసభ్యంగా ప్రవర్తించడం, దాడులు చేసిన సంఘటనలను తీవ్రమైన నేరాలుగా పరిగణించి వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేయాలి. అంతకంటే ముందు మద్యం తాగి వచ్చే రోగులను వైద్యశాలలోకి అనుమతించకుండా నిరోధించాలి. ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద భద్రతా ఏర్పాటు చేయాలి. ఆస్పత్రిలో అన్ని ప్రధాన పాయింట్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి గట్టి నిఘా పెట్టాలి.

–రాంబాబు, సూపరింటెండెంట్, ప్రభుత్వ వైద్యశాల, నందికొట్కూరు

మెజారిటీ సభ్యులు ఆమోదించిన అంశాలకు ప్రాధాన్యత



మున్సిపల్ సాధారణ సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, చిత్రంలో ఎంపీ బైరెడ్డి శబరి

నందికొట్కూరు: మున్సిపాలిటి అభివృద్ధికి మెజారిటీ సభ్యులు చేతులెత్తిన వాటికే ఆమోదించి తీర్మాణం చేయాలని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. బుధవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశానికి ఎమ్మెల్యే, ఎంపీ శబరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టేబుల్ అజెండాలోని 13 అంశాలకు సంబంధించిన వాటిలో మెజారిటీ సభ్యులు ఆమోదం తెలిపిన అంశాలనే తీర్మానించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధికారులు ముందుకు సాగాలని ఆదేశించారు. పట్టణ ప్రజల దాహం తీర్చేందుకు తమవంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. పట్టణాభివృద్ధికి అందరు సహకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పట్టణంలోని అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా మూల వెంకటరమణను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

అందరం కలిసి పట్టణాభివృద్ధికి కృషి చేద్దాం

పట్టణాభివృద్ధి అందరం కలిసి చేద్దామని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి స్పష్టం చేశారు. కేంద్రం పేదలకు గృహా నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టే ప్రతి పేదవాడికి ఆర్థిక సహాయం అందిస్తుందని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యేకు, ఎంపీకి వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చిన సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, భాస్కరరెడ్డిని సమావేశం పూర్తయిన తరువాత ఇవ్వాలని కూర్చోబెట్టారు. అయిన వినకుండా విధులకు ఆటంకం కలిగించేలా ప్రవర్తించడంతో నాయకులపై కేసు నమోదు చేయాలని డీఎస్పీ రామాంజి నాయక్ సీఐలకు ఆదేశించారు. వైస్ చైర్మన్లు ప్రశాంతి, రబ్బానీ, కౌన్సిలర్లు రాధిక, శాంతకుమారి, గుర్రాల లక్ష్మీదేవి, షేక్ సమీరా భాను, రూపాదేవి, చింత లక్ష్మీదేవి, రేష్మా, కరీష్మా తదితరులు పాల్గొన్నారు.

రెండు పంటలకు సాగు నీరందిస్తాం

నందికొట్కూరు: రైతులకు కేసీ కెనాల్ ద్వారా ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగు నీరు అందిస్తామని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. బుధవారం పట్టణంలోని మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగు చేసే పంటలకు సమృద్ధిగా సాగునీరు ఇవ్వడం ఖాయమని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలను మంజూరు చేయిస్తానని స్పష్టం చేశారు. స్థలాలు సేకరించి నివేదిక ఇవ్వాలని ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరమ్మను ఆదేశించారు. నాడు–నేడు కింద అంగన్‌వాడీ కేంద్రాలను ఎందుకు నిర్మించలేదని సీడీపీఓపై మండిపడ్డారు. సొంత భవనాలు నిర్మిస్తే అద్దే చెల్లించే పరిస్థితి ఉండేది కాదన్నారు. శాతనకోట గ్రామ సర్పంచ్ రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చెరువుల నుంచి పంట కాల్వల ద్వారా వచ్చే నీటి కాల్వలను పూడ్చేయడం తోతట్టు ప్రాంతాల్లో పంటలపై పారడంతో దెబ్బతింటున్నాయని సర్పంచ్ జనార్దన్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏ గ్రామ పంచాయతీకి ఎంత నిధులు ఇస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పింఛన్లు ఒకే రోజు పంపిణీ చేయడంతో పింఛన్‌దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, గత ప్రభుత్వంలో పంచినట్లే ఈ ప్రభుత్వం కూడా ఇవ్వాలని కోరారు. కొణిదేల గ్రామ అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ శోభరాణి, తహసీల్దార్ శ్రీనివాసులు, పీఆర్ డీఈ పాల్గొన్నారు.

31న మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు: మండలకేంద్రమైన ఆత్మకూరులోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 31న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ బుధవారం తెలిపారు. సమావేశానికి అన్నిశాఖల అధికారులు తమతమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. ప్రజాప్రతినిధులు కూడా హాజరై మండలంలో నెలకొన్న సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు.

శ్మశానవాటికలో బయటపడిన మృతదేహం

జూపాడుబంగ్లా: నేషనల్‌హైవే 340సీ రోడ్డు నిర్మాణంలో పోయిన దళితుల శ్మశాన వాటికలో బుధవారం మృతదేహం బయటపడడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామానికి సమీపంలోని సర్వే నంబర్ 395/ఏ లో 0.80సెంట్ల స్థలాన్ని దళితులకు శ్మశానవాటిక కోసం కేటాయించారు. అయితే దళితుల శ్మశానవాటిక స్థలంలో నేషనల్‌హైవే 340సీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. శ్మశానవాటికకు సంబంధించి కేవలం 18సెంట్ల స్థలం మాత్రమే మిగిలింది. రోడ్డు నిర్మాణం పనుల్లో భాగంగా శ్మశానవాటిక వద్ద కల్వర్టు నిర్మాణం చేపట్టారు. ఈ తవ్వకాల్లో శ్మశాన వాటికలో మృతదేహం బయటపడడంతో అటుగా వెళ్లిన వారు గుర్తించి భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉన్న 18సెంట్ల శ్మశానవాటికలో మృతదేహాల ఖననం కష్టసాధ్యమవుతుందని మరోచోట స్థలం కేటాయించాలని గ్రామస్తులు కొంతకాలంగా రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈనేపథ్యంలో శ్మశానవాటికలో పూడ్చిన శవం బయటపడడం అరిష్టమని, అధికారులు వెంటనే చర్యలు తీసుకొని దళితుల శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరుతున్నారు.

కేంద్ర పథకాలు చెంచులకు అందాలి



పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ జి.బి.మోహన్‌కుమార్

ఆత్మకూరు: నల్లమల అడవుల్లోని గిరిజనులకు పూర్తి స్థాయిలో కేంద్ర ప్రభుత్వ పథకాలు అందించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జి.బి.మోహన్‌కుమార్, ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజర్ కె.జి.నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని బైర్లూటి గూడెంలో ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చెంచు గూండేల్లో నివసిస్తున్న చెంచు గిరిజనుల స్థితిగతులు, జీవన పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో భాగంగానే ప్రతిఒక్కరికీ పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని, ఇంటింటికి మంచినీటి కుళాయిల, ప్రధాన రహదారి, సీసీ రోడ్లు, విద్యుత్ సౌకర్యం, నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గిరిజనులకు అందించేందుకు కమిటీ చైర్మన్‌గా ఎంపీడీఓ, కమిటీ మెంబర్లుగా మండల స్థాయిలోని పలు శాఖల అధికారులు ఉంటారన్నారు.

అర్హులైన గిరిజనులకు పథకాలు అందిస్తాం

కొత్తపల్లి: అర్హులైన గిరిజనులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందిస్తామని ఎంపీడీఓ మేరి అన్నారు. బుధవారం మండలంలోని ఎర్రమఠం గిరిజన గూడెంలో ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి గిరిజనునికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. గిరిజనులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలన్నారు. అదేవిధంగా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. పిల్లలను చదివించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి పార్థసారథి, గిరిజనులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసగౌడ్

వెలుగోడు: మండలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ లాలం రమేష్ సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ భవనములో బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పట్టణంలోని సీపీ నగర్ లో గత మూడు రోజుల నుంచి కుళాయిలకు నీళ్ల రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీలు ధ్వజ మెత్తారు. జనాభాకు తగినంత నీటి సరఫరా జరగడం లేదని, కొత్త నీళ్ల ట్యాంకు నిర్మాణ ప్రతిపాదనలు ఏమయ్యాయి అని ప్రశ్నించారు. అలాగే బోయరేవుల గ్రామంలో ఎస్సీ, బీసీ శ్మశాన స్థలాల సమస్యలను పరిష్కరించాలని, వెలుగోడు ఎస్టీ శ్మశాన స్థలమునకు అప్రూవల్ ఇప్పించాలని ఎంపీటీసీ శంకర్ నాయక్ తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్‌ను కోరారు. వెలుగోడు పట్టణంలోని నీటి ప్రాంతాలలో దోమల బెడద ఎక్కువగా ఉందని ఫాగింగ్ మిషన్ ద్వారా దోమల మందులను పిచికారీ చేయించాలని ఎంపీటీసీలు కోరారు. ఫాగింగ్ మిషను మరమ్మతులకు గురై ఏడాది కావస్తుందని సర్పంచ్ జయపాల్ పేర్కొనడం గమనార్హం. సమావేశానికి ఆర్‌టీసీ, మైనర్ ఇరిగేషన్, టీజీపీ, మత్స్యశాఖ, పోలీసు, ఎక్సైజ్ శాఖ, ఉద్యాన శాఖ,అటవీ శాఖ అధికారులు గైర్హాజరు కావడం పట్ల ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అమానుల్లా, వ్యవసాయ అధికారి పవన్ కుమార్, ఏపీఓ మల్లికార్జున, వెలుగోడు కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం డాక్టర్ అక్రమ్, ఐసీడీఎస్ సూపర్ వైజర్, ఏఈలు పకీరయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు కంటి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి షేక్షావలి

ఆత్మకూరురూరల్: జాతీయ నేత్రదాన పక్షత్సవాల సందర్భంగా స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు మంగళవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక నేత్రవైద్యాధికారి షేక్షావలి నేతృత్వంలో ఈ పరీక్షలు నిర్వహించి, 24 మంది విద్యార్థినులను దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. వీరికి ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. కంటివైద్యాధికారి షేక్షావలి మాట్లాడుతూ విద్యార్థులు నేత్రదానం పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. మన కుటుంబాలలో ఎవరైనా మరణిస్తే ఆరు గంటల్లో రెటీనాలను సేకరించాలన్నారు. ఒకరి నుంచి తీసిన రెటీనాలు ఇద్దరికి దృష్టిని ప్రసాదిస్తాయని ఆయన అన్నారు. దృష్టి లోపాలు రాకుండా పాలు, గుడ్లు, ఆకుకూరలు, క్యారెట్ వంటి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్యామల, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఉద్యాన పంటలతో లాభాలు



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏపీఓ రేష్మ

కొత్తపల్లి: ఉద్యానవన పంటలతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఏపీఓ రేష్మ అన్నారు. బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. సాగు కోసం ఇచ్చిన మొక్కలను రైతులతో పొలాల్లో నాటించాలని సూచించారు. మండలంలో ఉద్యానవన పంటల సాగుకు 130 ఎకరాలు మంజూరు అయ్యాయన్నారు. అందులో 60 ఎకరాలకు గాను 55 ఎకరాల్లో మునగ మొక్కలు నాటించామని, మరో 40 ఎకరాలకు గాను 25 ఎకరాల్లో మామిడి, జామ, చీని, నేరేడు వంటి మొక్కలు నాటించామని తెలిపారు. ఇంకా 30 ఎకరాల్లో మొక్కలను నాటాల్సి ఉందన్నారు. వాటిని కూడా ఫీల్డ్ అసిస్టెంట్లు చొరవ తీసుకుని త్వరగా పూర్తిచేయించాలన్నారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద వంద శాతం పని దినాలు కల్పించాలని సూచించారు.

అన్నదాన పథకానికి విరాళం

నంద్యాల(అర్బన్): మహానంది పుణ్యక్షేత్రంలో అన్నదాన వితరణ పథకానికి నంద్యాలకు చెందిన ది రిటైల్ మర్చెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మల్లికార్జున బుధవారం రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారని దేవస్థానం ఏఈఓ మధు తెలిపారు. ఆర్థిక సాయం అందించిన మల్లికార్జునకు స్వామి వారి ప్రసాదం అందజేశారు.

కౌలు రైతులను గుర్తించండి

వెలుగోడు: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన కౌలు రైతులను గుర్తించి వారికి కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని వీఆర్వోలను తహసీల్దార్ శ్రీనివాసగౌడ్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వీఆర్వోలు, రైతు సేవ కేంద్రం సిబ్బందితో ఏఓ పవన్ కుమార్‌తో కలసి సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలను వెంటనే ఈ–పంట నమోదు చేయాలన్నారు. మండలం ఇప్పటికి 446 కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చి 80% టార్గెట్ పూర్తి చేశారని, త్వరలో 100% పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు అన్వర్, వెంకటశివుడు, జగదీష్, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు: శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలో ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వై.ఆశీర్వాదం కోరారు. బుధవారం వేల్పనూరులో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. వై.ఆశీర్వాదం మాట్లాడుతూ.. తాగునీటిని ఫిల్టర్ చేయకుండా సరఫరా చేస్తున్నారని, శ్రీశైలం, సున్నిపెంట, లింగాగట్టు ప్రాంతాల్లో చిరుతపులి సంచారం ఎక్కువయ్యిందని, గ్రామాల్లో కొన్నిచోట్ల వీధిలైట్లు లేవన్నారు. భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఇబ్బదులు ఎదుర్కొంటున్నారని, నిలిచిన పనులను పునఃరుద్ధరించలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందించేలా చూడాలని, గైనకాలజిస్టును నియమించాలని విన్నవించారు. నేషనల్ మజ్దూర్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ ఎ.కాశయ్య, శేఖర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల పరిశీలన

కొత్తపల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను తహసీల్దార్ ఉమారాణి బుధవారం తనిఖీ చేశారు. రిజిస్టర్లు, రికార్డులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. సౌకర్యాలు, భోజనం, తదితర సమస్యలను విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, ఆటస్థలం, సాయంత్రం స్టడీ అవర్ సమయంలో చదువుకునేందుకు హాల్ ఏర్పాటు చేయించాలని ఉపాధ్యాయులు కోరారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ తెలిపారు.

–**పాములపాడు:** మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ, బాలికల వసతి గృహాలను ఎంపీడీఓ గోపీక్రిష్ణ, డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబులు తనిఖీ చేశారు. అదనపు గదులు, వంట గది నిర్మాణం, చేతిపంపు, గణితం, ఇంగ్లిష్, సైన్స్ పోస్టులు ఖాళీలున్నట్లు గుర్తించారు.

వేద సదస్సుల్లో వేదపండితుల ప్రతిభ



రవిశంకర అవధాని నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న శ్యామసుందర శర్మ

నంద్యాల(అర్బన్): కృష్ణాష్టమి సందర్భంగా రాజమహేంద్రవరం వేదశాస్త్ర పరిషత్‌లో 88వ వార్షిక వేద సదస్సులు కార్యక్రమంలో మహానంది క్షేత్ర వేదపండితులు వెంకట దుర్గానాగేశ్వరశర్మ, కుమారుడు వెంకట రామ ఫణి శ్యామసుందర్‌శర్మ ప్రథమ స్థానాన్ని సాధించారు. ఈ మేరకు బుధవారం మహానంది ఆలయ వేదపండితులు వెంకటరామ ఫణి శ్యామసుందర్‌శర్మను అభినందించారు. వేదశాస్త్రంలోని శ్రీకృష్ణ యజుర్వేదంలో మహానంది క్షేత్ర వేదపండితులు ప్రథమ స్థానంలో నిలిచి తిరుమల వేదవిద్యాపీఠం ప్రిన్సిపాల్, శృంగేరి పీఠాధిపతులు, కామకోటి, శ్రీకార్యం తదితర పీఠాధిపతుల నుంచి ధ్రువ పత్రాలు అందుకోవడం విశేషమని వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు.

మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలి



అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: బషీర్‌బాగ్ పోరాట స్ఫూర్తితో మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఏసురత్నం, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ముందు బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ నాడు కరెంట్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం చంద్రబాబు కర్కశత్వానికి నిజరూపమన్నారు. ఈ ఉద్యమం వంద రోజులపాటు సాగిందన్నారు. ముగ్గురు చనిపోగా 25 మంది సీపీఎం నాయకులు, కార్యకర్తలు గాయాలపాలయ్యారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు కె.జోసెఫ్ చంద్రశేఖర్, సీపీఎం నాయకులు డి.రామ్‌నాయక్, ఎ.సురేంద్ర, గణపతి, వీరన్న, శివకుమార్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బషీర్‌బాగ్ అమరులకు నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు

పాములపాడు: హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో 2000 సంవత్సరంలో విద్యుత్ పోరాటంలో అశువులు బాసిన అమరవీరులు బాలస్వామి, రామక్రిష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు సీపీఎం నాయకులు బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక సీపీఎం కార్యాలయంలో నాయకులు వెంకటేశ్వరరావు, స్వామన్న, రమణ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విద్యుత్ బిల్లులు పెంచితే నిరసనగా వామపక్ష పార్టీలు 2000 ఆగస్టు 28వ తేదీ పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టిందని గుర్తు చేశారు. ఉద్యమాన్ని అనచి వేయడానికి ఉద్యమకారులపై గుర్రాలతో తొక్కించడం, కాల్పులతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు.

ఫ్యాక్షన్ జోలికి వెళితే కఠిన చర్యలు



మల్యాల గ్రామంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజినాయక్

నందికొట్కూరు: ఫ్యాక్షన్ జోలికి వెళితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రామాంజి నాయక్ హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజలు అన్నదమ్ములుగా కలిసిమెలిసి ఉండాలని సూచించారు. గొడవలకు దూరంగా ఉండాలన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు. ఫ్యాక్షన్ వల్ల అనేక కుటుంబాలు నాశనమయ్యాయన్నారు. కుటుంబంతో ప్రశాంతమైన జీవనం గడపాలని చెప్పారు. టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐలు సురేష్‌బాబు, చంద్రశేఖర్, పోలీసులు ఉన్నారు.

సమస్యలపై జవాబుదారీతనంతో పని చేయాలి


● ఆర్డీఓ దాసు



వీఆర్వోలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్డీఓ దాసు

పాములపాడు: ప్రజల నుంచి వచ్చే అర్జీలపై జవాబుదారీతనంతో పని చేయాలని ఆత్మకూరు ఆర్డీఓ దాసు అధికారులకు సూచించారు. బుధవారం పాములపాడు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీఆర్వోలతో మాట్లాడుతూ.. నేషనల్ హైవే పనుల్లో భాగంగా ఆస్తులు కోల్పోయిన వారు పరిహారం కోసం వస్తే వారితో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. సానుకూలంగా సమస్యను పరిష్కరించి, వారికి న్యాయం చేసేందుకు ప్రయత్నించాలన్నారు. సమస్య జఠిలమైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మండలంలోని క్రిష్ణారావుపేట, రుద్రవరం, యర్రగూడూరు గ్రామాల్లో పలువురికి పరిహారం అందలేదని, కొందరు పరిహారం తీసుకుని కూడా మొండికేస్తున్నారని తెలిపారు. అలాంటి వారిని ఉపేక్షించేది లేదన్నారు. పోలీసులు సహకారంతో వెంటనే తొలగించనున్నట్లు పేర్కొన్నారు. కొందరికి పరిహారం అందాల్సి ఉందని.. వారికి కూడా త్వరలో అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. క్రిష్ణారావుపేట గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి రూ. లక్ష పరిహారం ఇస్తున్నట్లు చెప్పారు. తహసీల్దార్ సుభద్రమ్మ, డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, ఆర్ఐ, వీఆర్వోలు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ



కిచెన్‌లో నిల్వ చేసిన కూరగాయలు, పండ్లను పరిశీలిస్తున్న అధికారులు

పగిడ్యాల: కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలను ఎంపీడీఓ వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ రవి, ఎంఈఓ–2 మురళీమోహన్‌రెడ్డి, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అసంతృప్తిగా ఉన్న అదనపు గదుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, పాఠశాల కాంపౌండ్ వరకు సీసీ రోడ్డు వేయించాలని, తరగతి గది గోడలకు మరమ్మతు చేయించాలని పాఠశాల సిబ్బంది ఎంపీడీఓ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే నీటి సరఫరా చేసే బోరు మోటర్ పాడైపోయిందని స్టాండ్‌బైగా ఒక మోటర్ అదనంగా కావాలని అధికారులకు విన్నవించారు. అనంతరం కిచెన్‌లో నిల్వ చేసిన కూరగాయలు, అరటి పండ్ల నాణ్యతను వారు పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన వాటిని సరఫరా చేయించాలని పాఠశాల ప్రత్యేక అధికారి ఉషకు ఎంపీడీఓ సూచించారు.